# నిర్ణయం

పులిగడ్డ శ్రీరామచంద్రమూర్తి

**ఆ ఏడు గంటలూ ఏడు యుగాల్లా గడిచాయి శైలజకి! ఔనుమరి! ఆనందాన్ని అణచిపెట్టి, ఉద్వేగాన్ని ఊపిరితో బిగపట్టి, పెల్లుబికుతున్న ఉత్సాహాన్ని బలవంతాన గుండెల్లో కట్టిపడేసి...ఎంత సేపు? ఎంతసేపని? కళ్ళు తెరవడేం?**

మనూది మొద్దు నిద్రకాదు! మత్తు తెచ్చిన మైకం!

రైలు దిగి పరుగు పరుగున రాత్రి ఇంటికి వస్తే-తన మొహాన తలుపు తీసింది తన మనోహర్ కాదు! పనిమనిషి సుందరమ్మ! అబ్బాయి గారు-పైన "మత్తుగా" నిద్రపోతున్నారని సైగ చేసి చెప్పింది!

నిట్టూర్పు...వేడి నిట్టూర్పు తన్నుకు వచ్చింది! కొన్ని వందల చేతుల కరతాళధ్వనులను పదిలపరచుకున్న గుండెలోతుల నుండి క్షణంలో నిట్టూర్పు రూపంలో అన్నీ ఆవిరైపోయాయి!

అప్పటినుండి...రాత్రి పది గంటల నుండి ఎదురుచూస్తోంది భర్త మెలకువ కోసం!

కళ్ళ మీదకి మగత కమ్ముతున్నా-మను కళ్ళు తెరుస్తాడేమోనని భయం! కళ్ళు తెరిస్తే...మనూ కళ్ళు తెరిస్తే...

తల వంచి గుండెల మీదకి దృష్టి సారించింది!

గుండెల మీదుగా జారి వ్రేలాడుతున్న మంగళసూత్రం మధ్యన...తళతళలాడుతూ శాటిన్ రిబ్బన్‌కి కట్టి వున్న రజత పతకం వ్రేలాడుతోంది. మనూ కళ్ళు తెరవగానే-అతని కళ్ళల్లో ఆ పతకం తాలూకు మెరుపు ప్రతిఫలించాలి! ఆ మెరుపు తాలూకు వెలుగును తన గుండెల్లో పదిల పరచుకోవాలి!

మనూ లేవవూ! కళ్ళు తెరవవూ! ఈ ఆనందాన్ని భరించలేక నా మనసూ-ఈ విజయాన్ని మోయలేక నాగుండెలూ బరువెక్కుతున్నాయి! ప్లీజ్! షేర్ చేసుకోవూ! శైలజ ఆనందాన్ని ఆక్రోశం షేర్ చేసుకుంది.! పక్కకి వత్తిగిల్లిన మనోహర్ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు!

అపుడు ఉదయం అయిదు గంటలు దాటుతోంది!

"మనూ!" భర్త నుదుటి మీద చేయివేసి ఆప్యాయంగా పిలవబోయిన శైలజ అతని కళ్ళని చూస్తునే ఉలిక్కిపడింది! ఎంతోమంది కరతాళ ధ్వనుల మధ్య గర్వంగా తలెత్తి షీల్డ్‌ని అందుకున్న ఆ అమ్మాయి-అతని కళ్ళల్లోకి బెదిరిపోయిన లేడిలా చూసింది!

శైలజ గుండెల మీద వ్రేలాడుతున్న సిల్వర్ మెడల్ మీద మనోహర్ దృష్టి పడగానే-ఒక్కసారిగా అతని కళ్ళల్లో క్రోధాగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లాయి! కళ్ళు చింతనిప్పులయి-ముఖం కందగడ్డలా తయారయింది!

దిగ్గున మంచం దిగి పెద్దగా అరిచినట్లుగా చెప్పాడు "శైలూ! తీసేయ్! ఆ మెడల్ అవతల పారేయ్! దానిని నీమెడలో వేసుకుని నాకళ్ళెదుట కన్పిస్తే...నిన్ను ఏం చేస్తానో నాకే తెలీదు! నో! నేభరించలేను!"

ఈ హఠాత్ పరిణామానికి శైలజ నివ్వెరపోయింది! క్షణంసేపు నోటమాట రాలేదు! కాసేపటికి తేరుకుని-భర్తవైపు అయోమయంగా చూస్తూ అన్నది "మనూ...ఏమయింది? నీకు...ఏమయింది?"

పళ్ళబిగువున అన్నాడు " ఎస్! నేనే చెబుతున్నాను! కాదు! భర్తగా ఆజ్ఞాపిస్తున్నాను! ఆమెడల్ నాకళ్ళ ముందు కాదు! అసలు ఈ ఇంట్లోనే వుండకూడదు! ఆ జ్ఞాపకాలే మిగలకూడదు!"

నెమ్మదిగా నోరు పెగల్చుకుని అన్నది శైలజ "మనూ! అసలు...నీకేమయింది? కొన్నివేల గంటల సమయాన్ని త్యాగంచేసి, అకుంఠిత దీక్షతో, పట్టుదలతో ప్రాక్టీసు చేసి, మన మధ్యన వుండవలసిన ఎంతో అపురూపమైన, ప్రేమమయమైన కాలాన్ని కూడా వదిలేసి ప్రాక్టీసు చేసిని నేను-ఈరోజు ఈతపోటీలలో జిల్లాస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించాను మనూ! ఈ మెడల్ నామెడలో పడగానే-ఎంతమంది చప్పట్లు కొట్టినా-ఎన్ని గొంతుకలు అభినందనలతో ముంచెత్తినా-నామనసు, నాకళ్ళు, సర్వం నీకోసం-నీ అభినందనల కోసం ఎంతగా పరితపించి పోయాయో తెలుసా! నా విజయాన్ని నీకళ్ళల్లో చూస్తేనే నాకు తృప్తి! నా ఆనందం నీ పెదవుల మీద నాట్యం చేయాలి! అపుడే నాకు నిజమయిన ఆనందం! దానిని నీతో షేర్ చేసుకోడానికే-పరుగు పరుగున ఈదుతూ వచ్చాను మనూ! కాని...కాని...నువ్వు..."

కఠినంగా అన్నాడు మనోహర్ "నో! చెప్పొద్దు! శైలూ..పెద్ద..పతకమేదో గెలిచావని సంబరపడిపోతున్నావేమో! కాని..నిన్న..ఆపోటీల సమయంలో నీ అవతారాన్ని టి.వి.లలో చూస్తుంటే ఎంత అసహ్యం వేసిందో తెలుసా!...ఆ స్విమ్మింగ్ సూట్‌లో నువ్వూ...నగ్నంగా నీ తొడలూ...నీవీపు... భుజాలు...చేతులూ..ఛీఛీ తలచుకుంటూ వుంటేనే సిగ్గు వేస్తోంది! శరీరం జరదరిస్తోంది! నాతోపాటు టి.వి. చూస్తూ నీ అర్థనగ్న శరీరాన్ని ఎంజాయ్ చేసిన నా స్నేహితుల మొహాలు చూడాలంటేనే సిగ్గు వేస్తోంది!"

శైలజకి ఒక్కసారిగా శరీరం తూలినట్లయింది!

ఆసరాగా పక్కనే వున్న టేబుల్ మీదకి ఒరిగి, చేయి ఆనించి నిల్చుంది! ఆ టేబుల్ మీద వున్న ఆక్వేరియమ్‌లో నగ్నంగా ఈదుతున్న రంగు రంగుల చేపలు చిన్న చిన్న బుడగలు సృష్టిస్తున్నాయి!

మాటలు రానట్లుగా, చేష్టలుడిగి, కళ్ళప్పగించి శిలాప్రతిమలా నిల్చున్న భార్య వైపు తర్జని చూపిస్తూ మళ్ళీ అన్నాడు "పల్లెటూరి అమ్మాయి! బుద్ధిగా వుంటుంది! వంట వచ్చు! ఈత కూడా వచ్చునట-అంటే ఏమోలే అనుకున్నాను! ఏదో-చిన్నతనంలో పిల్ల కాలువలో ఈదులాడిన ఆకతాయి తనం అనుకున్నాను! కాని...కాని... ఇంతగా బరితెగించి-అసహ్యంగా-కొన్నివేల మంది ముందు-కెమెరాలు, వీడియోల ముందు-బట్టలు విప్పి అర్థనగ్న ప్రదర్శన అని తెలిస్తే...అసలు ప్రాక్టీసుకే వెళ్ళనిచ్చే వాడిని కాను! గడప దాటనిచ్చే వాడిని కాను! శైలజా! నాకు కావల్సింది పది మంది ముందు అర్థనగ్నంగా కన్పించే భార్య కాదు! నిండుగా వుండే ఇల్లాలు! అర్థమయిందా!" అని అతను శైలజ ముందరకు వచ్చి-ఆమె భుజం మీద చేయివేశాడు! ఆచేయి నెమ్మదిగా ఆమె మెడ మీదకి పాకింది పాములా! మరుక్షణం-ఆమె మెడలోని పతకాన్ని ఒక్కసారిగా, విసురుగా లాగాడు!

గట్టిగా ఊపిరి వదిలి-గుప్పిట విప్పిన మనోహర్ క్షణం సేపు తడబడ్డాడు! అతని చేతిలోకి మెడల్‌తో పాటు మంగళసూత్రం కూడా వచ్చింది! దవడ బిగించి "డామిట్!" అంటూ చిన్నగా గొణిగాడు!

శైలజ నిర్వికారంగా అతని చేతిలో నుండి మంగళసూత్రం తీసుకుని మెడలో తీసుకుంది! మరుక్షణం మనోహర్- విసురుగా, కసిదీరా చేతిలో వున్న మెడల్‌ని గోడవైపు గిరవాటు వేసాడు!



శైలజకి ఒక్కసారిగా నీరసం ఆవహించింది! ఆషాక్‌కి తట్టుకోలేనట్లుగా, నిస్త్రాణగా మంచం మీదకి వాలిపోయింది!

దాదాపు మూడు గంటల తర్వాత...

హాల్లో–సోఫాలో కూర్చుని పేపర్ చదువుతోంది



## బిజీగా ఉన్న కమల్ హసన్

ఎంతో ఖర్చు పెట్టి ప్రతిష్టాత్మకంగా తీస్తున్న 'మరుదనాయకమ్' సినిమా కోసం కమల్‌హసన్ చాలా శ్రద్ధ తీసికొంటున్నాడు. అందులోని ఓ పాత్రకోసం ఫ్రెంచ్ హీరోయిన్ 'పోరుక్ దారా' అనే అమ్మాయిని తీసికొస్తుండగా, మరో పాత్ర కోసం గౌతమిని అనుకుంటున్నారట. అయితే ఈ పాత్ర గుండుతో కన్పించాలట. కొత్తగా పెళ్లైన గౌతమి ఇందుకు ఒప్పుకుంటుందో లేదో? అయినా కమల్ అడిగితే దేనికైనా సిద్ధపడే వాళ్లు చాలామందే ఉన్నారుగా.

శైలజ! ఆపేపర్‌లో స్పోర్ట్స్ పేజిలో శైలజ ఫోటో వేసి-అభినందనలు తెలియజేస్తూ-రాసిన వార్తల వెంబడి-నిరాసక్తంగా పాగుతున్నాయి ఆమె కళ్ళు!

ఆ కాస్త వ్యవధిలోనే ఆమె ముఖం పాలి పోయి, కళ్ళు ఉబ్బి-రక్తం ఇంకి పోయినట్లుగా అయిపోయింది!

అడుగుల చప్పుడికి తలతిప్పి చూసింది! మనోహర్! నీట్‌గా డ్రెసెప్ అయి వున్నాడు! సరాసరి వచ్చి భార్య ఎదురుగా కూర్చుని అన్నాడు "శైలూ! వారం క్రితమే చెప్పినట్లు గుర్తు! ఈరోజు నేను డైరెక్ట్ చేసిన సినిమా రిలీజ్ అయింది! ఆ సందర్భంగా ప్రొడ్యూసర్ పార్టీ ఎరేంజ్ చేశాడు! నువ్వు కూడా త్వరగా రెడీ అయితే!..." అర్థోక్తితో ఆగిపోయాడు!

శైలజ మాట్లాడలేదు! తలెత్తలేదు!

"శైలూ! సారీ! నిన్ను హర్ట్ చేసినట్లున్నాను!"

శైలజ తలఎత్తి అతని కళ్ళల్లో ఏదో వెతకబోయింది! మనోహర్ కళ్ళు నిర్మలంగా వున్నాయి!

"శైలూ! చెప్పానుగా! నువ్వు ఛాంపియన్‌వి అయి వుండవచ్చు! ఈత పోటీలలో మన జిల్లా తరపున వెండి పతకం సాధించి వుండవచ్చు! కాని-అది ఏ కేరమ్స్ లోనో, కనీసం కరాటేలో అయినాసరే-నీవెనకే వుండేవాడిని! కాని మగవాడిగా, మొగుడిగా-అందరి ముందు నిన్ను ఆ దుస్తుల్లో-భరించలేను! ట్రైటు అండర్‌స్టాండ్ మి!"

ఒక్కసారిగా శైలజ కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి! గొంతు బొంగురు పోయింది! "లేదు! మనూ! నువ్వే నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేదు! ఆట ఏదయినా ప్రతిభ ఒక్కటే! దుస్తులను బట్టి ఆట విలువ మారదు! పోటీ ఒకటే! ఈతదుస్తులు అంటే అర్ధనగ్న ప్రదర్శన అనే ఆలోచన...అసలు నీకు ఎలా వచ్చింది! మనజిల్లా తరపున పోటీ మనూ! అది! నీకు తెలుసా! అంతమంది ముందు స్విమ్మింగ్ పూల్ ఒడ్డున నిలబడ్డ నా గమ్యమల్లా ఒకటే-అవతల ఒడ్డుకి ఎంత త్వరగా చేరుదామా అని! నా ధ్యేయం ఒకటే-నా పక్క వారిని ఎలా అధిగమించాలి అని! ప్రేక్షకులు కూడా నన్ను అలాగే ఉత్సాహపరిచారు! ఎంతో ఉత్తేజ పరిచారు! నేను ఈదుతుంటే-వారు ఇచ్చే ఉత్సాహం- ఉత్తేజమై, ఒక్కో కెరటమై నన్ను ముందుకు తోసింది! విజయం సాధించాక ఎంతో అభిమానంతో, పొంగిపొర్లే ఆప్యాయంతో నాకు అభినందనలు తెలుపుతుంటే ఏ ఒక్కరి దృష్టి నా కాళ్ళ మీదగాని, వీపు మీదగాని, అసలు నా శరీరం మీదనే పడలేదు! మన జిల్లా తరపున నన్ను మనస్ఫూర్తిగా-ఒక ఆడపడుచులా అభినందించారు! వారి అభినందనల్లో ఎలాంటి కల్మషం లేదు! ఎందుకంటే ఇది ఒక పోటీ! ఈరోజు జిల్లా తరపున, రేపు దేశం తరపున!"

"ఏం? లాల్చీ పైజమా వేసుకుని ఈత కొట్టచ్చుగా!"

అతని వ్యంగ్యానికి మనసులో ముల్లు గుచ్చుకున్నా-బలవంతాన నవ్వు పులుముకుని అన్నది "ప్రతి ఆటకీ కొన్ని రూల్స్ అంటూ వుంటాయి మనూ!"

క్షణంసేపు ఆగి మళ్ళీ అన్నది "మనూ! నేను జాతీయస్థాయి ఈత పోటీలకి సెలక్ట్ అయ్యాను మనూ! ఎవరికో రాని అదృష్టం ఇది! ఈసారి స్వర్ణపతకం సాధించాలి! మనూ! ప్లీజ్! నీ అమాయకత్వంతో నన్ను డిస్కరేజ్ చేయవద్దు! రేపటి నుండి మళ్ళీ ప్రాక్టీసుకి వెళ్ళాలి మనూ! ప్రతి పురుషుడి విజయం వెనుకా ఒక స్త్రీ వుంటుంది! అలాగే ప్రతి స్త్రీ అపజయం వెనకా ఒక పురుషుడు వుంటాడనే అపవాదు నిజం చేయకు మనూ! నన్ను ఒలంపిక్ స్థాయికి చేర్చే నా సాధనని నీ చేయూత నివ్వు మనూ! నీ ప్రోత్సాహమే నాకు వందమంది కోచ్‌లతో సమానం! నీ ఉత్సాహమే నాకు వెయ్యి ఏనుగుల బలం ఇచ్చే ఆత్మస్థైర్యం మనూ!" మనోహర్ దిగ్గున లేచాడు! అతని కళ్ళు ఎర్రగా అయి-ముఖాన చెమటపట్టటింది! "నీ వాదన నీదేనన మాట! కాని-నేను మాత్రం ఒప్పుకోను! అసలు ఆలోచించవలసింది ఏదీలేదు! ఆలోచించడం అంటూ జరిగితే-అది...వి.డి.పో.న.డం..గురించి! దట్సాల్" ఒక్కక్షణం అక్కడ వుండకుండా బయటకు వెళ్ళిపోయాడు!

శైలజ పాలిపోయిన మొహంతో-అతను వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయింది! ఫోన్ మ్రోగిన శబ్దానికి వులిక్కపడి-రిసీవర్ తీసుకుంది!

పరిమళ! ఫ్యామిలీ ఫ్రెండ్ "హాయ్! శైలజా! కంగ్రాట్స్! ఏం చేస్తున్నావు! మనోహర్ డైరెక్ట్ చేసిన సినిమా ఈరోజేగా రిలీజ్! నేను వస్తున్నా! రెడీ అయి వుండు" మరో అరగంటలో పరిమళ, ఆమె భర్త వచ్చారు! మనోహర్ పార్టీకి ఒక్కడే వెళ్ళాడని తెలిసి లోపల బాధపడ్డా పైకి కన్పించకుండా-శైలజని తొందరపెట్టి సినిమాకి లాక్కు వెళ్ళారు వాళ్ళిద్దరూ!

ఆ సాయంత్రం-పార్టీ తాలూకు మత్తుతో అడుగులు స్వల్పంగా తడబడుతుంటే లోపలికి వచ్చిన మనోహర్‌కి కన్పించింది ఉత్తరం అక్వేరియం క్రింద!

"నువ్వు డైరెక్ట్ చేసిన సినిమా చూస్తుంటే అర్థమయింది అసలు అర్ధనగ్నమంటే ఏమిటో! నీ సినిమాలో వున్నది ఆర్ట్ కాదు! అసహ్యం! అర్ధనగ్నం! వికారం! ఆడవాళ్ళని ఎంత అసహ్యంగా, నీచంగా చిత్రీకరించవచ్చో చూపి దానికి కళాత్మకత అని పేరు పెట్టావు! నీ భార్య-నీ జిల్లా తరపున పోరాడి ప్రతిభని ప్రదర్శిస్తే-అది నీకు సిగ్గుచేటు అన్నావు! కాని-నీ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సినిమా-అందులోని ద్వంద్వార్థ డైలాగ్స్, అర్థంపర్థం లేని అర్ధనగ్న దృశ్యాలు చూస్తుంటే సిగ్గుతో, అవమానంతో తలబద్దలు కొట్టుకోవాలనిపించింది! మనోహర్! మన సమాజాన్ని పరిపుష్టితంగా వుంచేది యువత! కాని వారిని ఒక మత్తు ప్రపంచంలో ముంచి, అర్థంలేని అర్ధనగ్న ఊహాప్రపంచాల చుట్టూ తిప్పి ఆరోగ్య కరమయిన పంథాలో నడువవలసిన యువత ఆలోచనా ధోరణిని పెడమార్గాన పడ్డడానికి నడుం కట్టావు! వారిని నిర్వీర్యం చేస్తున్నావు! కాని-మనోహర్ నిశ్చయంగా నీపంథా తప్పు! నీ ఆలోచనా విధానం తప్పు! అందుకే-యువత కోసం-వారిలో క్రీడాసక్తి పెంచడం కోసం, పోరాట పటిమని పటిష్ట పరచడానికి, నాజాతి కోసం, నాదేశాన్ని క్రీడాస్థలంలో ముందు వరసలో నిల్చోపెట్టడానికి-వెళ్ళిపోతున్నాను!

ఒక అర్ధనగ్న దృశ్యాల దర్శకుడి భార్యగా సమాజంలో తలదించుకుని జీవించే కంటే-ఈతదుస్తుల్లో నాదేశం కోసం గర్వంగా తలెత్తుకుని నిలబడటమే నాధ్యేయం! గుడ్‌బై-శైలజ!